క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని తోమాలపల్లికి చెందిన కొత్తకాపు మహేశ్వర్‌రెడ్డి సోమవారం మృతి చెందాడు. స్థానిక నాయకులతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి గ్రామంలో మృతుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పెద్దింటి వెంకటేష్, నందిమల్ల అశోక్, ధర్మారెడి, లాల్‌యాదవ్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని 14వ వార్డులో గల అంబేడ్కర్ కాలనీకి చెందిన ధ్యానరత్న అవార్డు గ్రహీత ఎస్ఆర్.ప్రేమయ్య ఈనెల 4న గుండెపోటుతో మృతి చెందారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సోమవారం పట్టణ కేంద్రానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రేమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మదనాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్, పాపయ్యగారి కృష్ణారెడ్డి, పెద్దమందడి మాజీ జెడ్పీటీసీ వెంకటస్వామి, కో ఆప్షన్ సభ్యుడు మిషేక్, ప్రేమదానం తదితరులు ఉన్నారు.

శ్రీరంగాపురం ఎస్ఐ, ఎంపీడీఓకు సన్మానం



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలో ఇటీవల బాధ్యతలు తీసుకున్న ఎస్ఐ రామకృష్ణ, ఎంపీడీఓ రవినారాయణను సోమవారం బీఆర్ఎస్ మండల పార్టీ నాయకులు సింగిల్ విండో అధ్యక్షుడు జగన్నాథంనాయుడు, పృథ్వీరాజు ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వెంకటస్వామి, పర్వతాలు, వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యంయాదవ్, రాధాకృష్ణ, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

పాన్‌గల్: కులం పేరుతో దూషించి, బూతులు తిట్టిన ఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్‌కు చెందిన ఆదితరుణ్, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో పనిచేస్తున్నారు. పని విషయంలో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తరుణ్‌గౌడ్ అనే వ్యక్తి ఫోన్ నుంచి ఈనెల 5వ తేదీ రాత్రి పాన్‌గల్‌లోని తన ఇంట్లో నిద్రిస్తున్న ఆదితరుణ్‌కు కాల్ వచ్చింది. ఫోన్‌లో కులం పేరుతో దూషిస్తూ నానా బూతులు తిట్టారని బాధితుడు వాపోయాడు. కులం పేరుతో దూషించిన తరుణ్‌గౌడ్, అందుకు కారణమైన జీఎం మహబూబ్ పైన కూడా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆది తరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం మిస్సింగ్ కేసు నమోదయిందని ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. గోపాల్‌పేట హనుమాండ్ల గడ్డ కాలనీకి చెందిన తిరుపతయ్య, రామేశ్వరమ్మ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉండగా.. వారందరికీ పెళ్లిళ్లయ్యాయి. తిరుపతయ్య ఆదివారం మధ్యాహ్నం పొలానికి వెళ్లి మోటార్ పెట్టి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఆతర్వాత ఇంటికి రాలేదు. దీంతో సోమవారం తిరుపతయ్య భార్య రామేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



ఖిల్లాఘనపురం: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఉత్తరయ్య అన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని ఉప్పరిపల్లిలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వయో వృద్ధులు, మోటారు వాహనాల చట్టాల గురించి పూర్తిగా తెలుసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు వాహనాలు ఇచ్చే ముందు తప్పనిసరిగా జాగ్రత్తలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ శ్రీదేవి, ఏఎస్ఐ నాగరాజు, గందం యాదగిరి, ఆంజనేయులు, పాల్గొన్నారు.

పార్వతీదేవిగా అమ్మవారు..

సాక్షి, నెట్‌వర్క్: దేవీశరన్నవరాత్రులను పురస్కరించుకొని సోమవారం జిల్లాలోని వివిధ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు కుంకుమార్చన చేశారు.

- ఆత్మకూర్ పట్టణంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయం, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం, కోట్లాంజనేయస్వామి, అష్టలక్ష్మి ఆలయం, వాల్మీకినగర్, కేశవనగర్‌లో ఆలయాల్లో పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి స్థానిక వాసవీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.
- కొత్తకోట పట్టణ కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రావుల రవీంద్రనాథ్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో అర్ధనారీశ్వరిదేవిగా, భవానీ మాత ఆలయంలో మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.
- అమరచింత పట్టణంలోని కాళికాలయంలో సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు. మండలంలోని ధర్మాపురం, ఈర్లదిన్నె గ్రామాల్లో అమ్మవారిని మహాచండి అవతారంలో అలంకరించారు.
- పెబ్బేరు మండలంలోని సూగూరు, పెబ్బేరు పట్టణంలో వాసవీ కన్యాకాపరమేశ్వరి ఆలయంలో రాజరాజేశ్వరి దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.
- మదనాపురం మండల కేంద్రంతో పాటు దుప్పల్లి, కొత్తపల్లిలో అమ్మవారు లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



ఆత్మకూర్‌లో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



దుప్పల్లిలో..



పెబ్బేరులో..



శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో..



కొత్తకోట కన్యకాపరమేశ్వరి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రావుల రవీంద్రనాథ్‌రెడ్డి



ఆత్మకూర్‌లో పూజల్లో పాల్గొన్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణమ్మ



అమరచింత కాళీకాలయంలో భక్తుల పూజలు..

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: గత ప్రభుత్వంలో రూ.15 లక్షలతో మంజూరైన సీసీ రహదారి పనులను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. పట్టణ శివారులోని జములమ్మ ఆలయానికి భక్తులు కంకర తేలిన రహదారిపై నడవడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిసి మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తన నిధుల్లో రూ.15 లక్షలు సీసీ రహదారి కోసం మంజూరు చేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజ్‌కుమార్, మార్కెట్ మాజీ చైర్మన్ ఎస్ఏ రాజు, నాగభూషణంగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు అక్కల నరసింహులుగౌడ్, ప్రధాన కార్యదర్శి జింక రవి తదితరులు పాల్గొన్నారు.

‘క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది’

కొత్తకోట రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలగడంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. సోమవారం పెద్దమందడి మండలం వెల్టూర్‌లో నిర్వహించిన గ్రామ స్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను స్నేహపూర్వ వాతావరణంలో ఆడుకోవాలని, ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా చూడాలన్నారు. గ్రామీణ క్రీడల వలన ఐక్యత ఏర్పడటంతో పాటు యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సబ్సిడీ సిలిండర్ల ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సద్గుణ, మాజీ ఎంపీపీ రఘుప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌చంద్రయ్య, జగదీశ్వర్‌రెడ్డి, రమేష్, సత్యారెడ్డి, మహేష్, వివేక్‌సాగర్, శేఖర్, డీలర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నూతన పంచాయతీ భవనం ప్రారంభం..

పెద్దమందడి మండలంలోని ముందరితండాలో నూతనంగా నిర్మించి గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలాంటివని, గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రఘుప్రసాద్, మాజీ సర్పంచ్ జయంతి, చీకురుచెట్టుతండా మాజీ సర్పంచ్ రాధాకృష్ణ, శంకర్, వెంకటస్వామి, రమేష్‌గౌడ్, తిరుపతిరెడ్డి, గట్టుయాదవ్, సుదర్శన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, సక్రునాయక్ తదితరులు ఉన్నారు.



ముందరితండాలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

సాగునీటి సమస్యకు పరిష్కారం

పాన్‌గల్: మండలంలోని రాయినిపల్లి శివారులోని భీమా డిస్ట్రిబ్యూటర్ 18 కాల్వలో సాగునీరు వెళ్లే విషయంలో రైతుల మధ్య ఉన్న విభేదాలను సోమవారం స్థానిక ఎస్ఐ శ్రీనివాసులు, భీమా డీఈ కిరణ్ ఆధ్వర్యంలో పరిష్కరించారు. గత నెలలో సంభవించిన భారీ వర్షాలు, సాగునీటి కాల్వలో నీటి సామర్థ్యం పెరిగి రైతుల పొలాల మీదుగా సాగునీరు ప్రవహిస్తుందనే ఉద్దేశ్యంతో సమీప రైతులు కొందరూ డిస్ట్రిబ్యూటర్ కాల్వలో మట్టి అడ్డం వేశారు. దీంతో కాల్వలో సాగునీరు ప్రవహించక ఇబ్బందులు పడుతూ రైతుల మధ్య ఘర్షణ చోటు చేసుకొని, ఆ పంచాయతీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. దీంతో పోలీసులు, భీమా అధికారులు గ్రామానికి చేరుకొని ఇరువురు రైతులకు ఉన్న విబేధాలను పరిష్కరించి కాల్వలో అడ్డుగా ఉన్న మట్టిని జేసీబీతో తొలగించారు.



రైతులతో మాట్లాడుతున్న పోలీసులు, భీమా అధికారులు

బీటీ రోడ్డు వేయాలని వినతి

అమరచింత: మండలంలోని నందిమళ్ల గ్రామానికి బీటీ రోడ్డు వేయాలంటూ గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ ఆదర్శ్ సురభికి వినతిపత్రం అందించారు. ఈమేరకు గ్రామస్తులు మాట్లాడుతూ.. 2013 సంవత్సరంలో కృష్ణ పుష్కరాల సందర్భంగా ఆత్మకూర్ నుంచి మూలమళ్ల మీదుగా నందిమళ్లకు బీటీ రహదారి కోసం నిధులు మంజూరయినా.. రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రహదారి వ్యవస్థ బాగాలేక ఆర్టీసీ బస్ సర్వీస్‌లు గ్రామానికి రావడం లేదని వాపోయారు. విద్యార్థులు సమయానికి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లడానికి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అత్యవసర సమయంలో చికిత్స అందక పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చిన్న కురుమూర్తి, తిరుపతి, మునేప్ప, సురేష్, కర్రె బాలన్న, పాండు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నందిమళ్ల గ్రామస్తులు

నీట్ ర్యాంకర్‌కు సన్మానం



వనపర్తి టౌన్: నీట్‌లో 443వ ర్యాంక్ సాధించిన కావలి వసంతను సోమవారం జిల్లా కేంద్రంలోని వారి స్వగృహంలో వాల్మీకి సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉన్నతంగా చదివి తల్లిదండ్రుల పేరును నిలబెట్టాలని సూచించారు. వృత్తిలో పేదలకు వైద్యం సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో దేవేందర్ నాయుడు, అంజి, నాగార్జున, రఘు నాయుడు, నర్సింహ, నారాయణ, రాకేష్ నాయుడు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ : ఎస్పీ



వనపర్తి రూరల్: మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ సాధ్యమవుతుందని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. సుమన్ చోటోఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం పెబ్బేరులో నిర్వహించిన కరాటే గ్రేడింగ్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎస్పీ చేతుల మీదుగా సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో బాలబాలికలు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కృష్ణమనోహర్, ఆర్ఐ అప్పనాయుడు, ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి, కరాటే మాస్టర్లు శ్రీనివాసులు, భీష్మనాథ్, ట్వింకిల్ రెడ్డి, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠ



గోపాల్‌పేట: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో సోమవారం ఆంజనేయస్వామి గుడి వద్ద నిర్వహించిన ధ్వజస్తంభ మహోత్సవంలో వ్యవసాయ శాఖ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో గడిపేలా దేవుడి ఆశీర్వాదం అందించాలని ఆకాంక్షించారు. గ్రామ అభివృద్ధి కోసం ఎప్పుడూ తాను ముందుంటానని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, రైతుసంఘం మాజీ కోఆర్డినేటర్ తిరుపతి, మండల అధ్యక్షుడు బాల్‌రాజు, మతీన్, చంద్రశేఖర్, మన్యంనాయక్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అట్ల బతుకమ్మకు పూజలు



ఆత్మకూర్‌లో బతుకమ్మ సంబరాల్లో మహిళలు

ఆత్మకూర్: బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ మహిళల సంబురాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సోమవారం రాత్రి అట్ల బతుకమ్మలను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి బొడ్డెమ్మలు వేసి ఆడిపాడారు. స్థానిక వాసవీమాత, నీలకంఠేశ్వరుడు, బాలబ్రహ్మేశ్వర ఆలయం, కేశవనగర్, భార్గవీనగర్, శివాజీనగర్‌తో పాటు మండలంలోని గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున అట్ల బతుకమ్మ వేడుకలను సంబురంగా నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో..

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని మూడో అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్ మంజులారాణి ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించగా.. చిన్నారులు ఆటపాటలతో సంబురం చేసుకున్నారు. అనంతరం కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవి నారాయణ, ఎంపీఓ రాజు, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బతుకమ్మ సంబరాలను మహిళలు ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని డఫోడీల్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో అక్షయ రికార్డింగ్ స్టూడియో వారి ఆధ్వర్యంలో బతుకమ్మ పాటలను రికార్డు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎస్ఐ రాణి బతుకమ్మను పేర్చి ఆడియో రికార్డింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



శ్రీరంగాపురం అంగన్‌వాడీ కేంద్రంలో..



వీపనగండ్లలో..

అనుమానితుల రక్త నమూనాలు సేకరణ

పాన్‌గల్: మండలంలోని రాయినిపల్లికి చెందిన శివశంకర్‌కు డెంగీ పాజిటివ్ అని తేలడంతో సోమవారం పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి డెంగీ నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. బాధిత కుటుంబ సభ్యులతో పాటు ఇంటి పరిసరాల్లోని గృహాల కుటుంబ సభ్యుల నుంచి రక్తనమూనాలను సేకరించినట్లు డాక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. నీటి నిల్వలతో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ నిహారిక, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, వైద్య సిబ్బంది రాంచందర్, మదన్‌గోపాల్, కళావతి, ఏఎల్‌ఓ టీం సభ్యులు సతీష్, మధుబాబు, తిరుపతయ్య, శాంతిభూషణ్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

సెల్‌టవర్ నిర్మాణం పూర్తి చేయించాలి

వీపనగండ్ల: తమ గ్రామంలో సెల్ టవర్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయించాలని గోవర్ధనగిరికి చెందిన పలువురు సోమవారం జిల్లా కేంద్రంలో ప్రజావాణిలో కలెక్టర్‌తో పాటు ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సెల్ టవర్లకు సంబంధించి సిగ్నల్స్ రాకపోవడంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, గ్రామస్థుల సహకారంతో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న ఏయిర్‌టెల్ సెల్‌టవర్‌ను కొందరు గ్రామానికి చెందిన వ్యక్తులు అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పెంటయ్య, వెంకటస్వామి, సురేష్‌రెడ్డి, నవీన్‌గౌడ్, చిన్నబుచ్చిరెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లను మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రాబర్ట్, జిల్లా నాయకుడు శ్రీహరి అన్నారు. సోమవారం స్థానిక లబ్ధిదారులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. 2008లో అప్పటి ఎమ్మెల్యే స్వర్ణమ్మ సర్వే నంబర్ 288లో 16 ఎకరాల ప్రభుత్వ స్థలంలో 70 గజాల చొప్పున 1,200 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారని, కానీ నేటి వరకు స్థలాలు అప్పగించలేదని అసహనం వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని గ్రామాల్లో శ్మశానవాటికలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, మూలమళ్లకు కొత్త బీటీ రోడ్డును నిర్మించాలని, తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ చాంద్‌పాషాకు అందజేశారు. కార్యక్రమంలో నర్సింహాయ్యశెట్టి, బాలరాజు, ఆంజనేయులు, లింగన్న, నారాయణ, ఖాజీపీర్, లబ్ధిదారులు ఉన్నారు.

ముగిసిన డిజిటల్ సర్వే



రాజనగరం కాలనీలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

వనపర్తి టౌన్: ప్రతీ కుటుంబానికి ఫ్యామిలీ హెల్త్ కార్డు మంజూరు చేసేందుకు పైలెట్ ప్రాజెక్టులో భాగంగా పుర పరిధిలోని రాజనగరం కాలనీలో చేపట్టిన డిజిటల్ సర్వే సోమవారం ముగిసింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రతి కుటుంబ యజమాని పేరు, కుటుంబీకుల వివరాలు, పుట్టిన తేదీ, ఆధార్ నంబర్ తదితర అంశాలను నమోదు చేసేందుకు ఈ సర్వేను చేపట్టారు. మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ శివకుమార్, ఆఫీసర్లు భాగ్యలక్ష్మి, లక్ష్మి, రాధ, కృష్ణవేణి, యూడీఆర్ఐ రాజ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది రాజు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ సేవలందించాలి

గోపాల్‌పేట: కొన్నిరోజులుగా ఏదుల మండలంలో రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయాయని, వెంటనే సేవలను పునరుద్ధరించాలని గ్రామస్తులు సోమవారం మండల కార్యాలయం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళనకు దిగారు. దీంతో కలెక్టర్ ఆర్డీఓ పద్మావతిని మండలానికి పంపారు. సమస్యలు పరిష్కరిస్తామని ఆర్డీఓ గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

అమరచింత: వివిధ కారణాలతో పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేసి బాధితులకు సోమవారం అప్పగించామని ఎస్ఐ సురేష్ తెలిపారు. పట్టణానికి చెందిన ఎస్ పాషా, చాంద్, వెంకటేష్, సింగంపేటకు చెందిన నవీన్, కొంకన్‌వానిపల్లికి చెందిన గోవిందు, మాసన్న ల సెల్‌ఫోన్లను తిరిగి అప్పగించామన్నారు. మండలంలో ఇప్పటి వరకు 58 మంది సెల్‌ఫోన్లను పొగొట్టుకున్నట్లు ఫిర్యాదు చేయగా.. వాటిలో 44 ఫోన్లు రికవరీ చేశామన్నారు.

ఎస్ఆర్ శంకరన్‌కు నివాళి

వనపర్తిటౌన్: సంక్షేమం అన్న పదానికి అంబేడ్కర్ తర్వాత ఆ స్థాయిలో జీవం పోసేందుకు జీవితమంతా ధారపోసి రాజ్యాంగ రథసారథికి వారసుడిగా ఆధునిక ప్రపంచంలో ఎస్ఆర్ శంకరన్ నిలిచారని డాక్టర్ మురళీధర్, మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. శంకరన్ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్ శంకరన్ పార్క్‌లో ఆయన విగ్రహానికి పూలవేసి నివాళులర్పించారు.